వేదంలో ఏమని చెప్పాడు అంటే నీకు గౌరవం ఉన్నంతమాత్రంచేత, అధికారం ఉన్నంత మాత్రం చేత, ఐశ్వర్యం ఉన్నంతమాత్రంచేత చదువు ఉన్నంతమాత్రంచేత మీకు మోక్షం రాదు. నువ్వు పరమపవిత్రుడు అయితే నీకు ప్రేమతత్వం ఉంటే నీకు సత్‌కర్మ నిష్కామంగా చేసే స్వభావం ఉంటే ఇవన్నీ నీకు ఉంటే మోక్షం వస్తుంది కాని బయట గొడవల వలన నీకు మోక్షం రాదు అని వేదంలో చెప్పాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-10-2011, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడిని స్మరించమంటే, ఆయనను ధ్యానం చేయమంటే మనం చెయ్యము. మనలో అంతర్యామిగా ఉన్న నారాయణుడే ఆ ధ్యానం చేసే బుద్ధిని, అటువంటి మంచి బుద్ధిని మనకు ప్రసాదించాలి. అప్పుడు నారాయణుడిని ధ్యానం చేయగా చేయగా, ఆయన నామాన్ని స్మరించగా స్మరించగా ఆయన స్వరూపం మనకు తెలియబడుతుంది. నారాయణుడు కాలస్వరూపంలో ఉన్నాడు. మనకు చనిపోయేరోజు వస్తే సాధన చెయ్యగలమా, సాధనచెయ్యలేము. అందుచేత ఇప్పడే కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సాధన చెయ్యకుండా సిద్ధి కలుగదు. మీరు కాలాన్ని పాడుచేసుకొంటున్నారు. డబ్బుపోతే తిరిగి సంపాదించుకోగలం కాని పోయిన కాలాన్ని తిరిగి సంపాదించలేము. యిప్పడు మనకు 70సంవత్సరాలు అనుకోండి మరల 30వ సంవత్సరం రమ్మంటే రాదు. యింక కాలం వెనక్కి వెళ్ళదు అందుచేత కాలాన్ని సద్వినియోగం చేసుకోండి.

ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి ఒక ఫ్రెంచ్ రచయిత రెండు సూచనలు చెప్పాడు. మీరు సాధన చేసేటప్పడు ఆత్మసాక్షాత్కారం కలిగేవరకూ సాధనలో పడిపోతూ ఉంటారు, అలా ఎన్నిసార్లు పడిపోయినా లేచి మరల సాధన మొదలుపెట్టండి. ఎంత ప్రయత్నం చేసినా ఫెయిలవుతున్నాము ఏమిటి అని మొత్తానికి సాధన మానేయకండి ఎన్నిసార్లు పడిపోతే మరల అన్నిసార్లు లేస్తూఉండండి, సిద్ధి కలిగేవరకూ సాధన విడిచిపెట్టవద్దు. మీ బుద్ధిని మీ జేబులో పెట్టుకోండి ఎవరికీ యిచ్చేయవద్దు. అంటే రోజులు మంచివి కాదు ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో మనకు తెలియదు. మంచిస్వభావం లేనివారు కూడా మంచి వారికింద కనిపిస్తారు. మీకు తెలియక మీ బుద్ధిని వారి జేబులో పెడితే సర్వస్వం కోల్పోతారు. ఎవరైనా ఏదైనా చెపితే వినండి. అందులో మంచి ఉంటే స్వీకరించండి, చెడ్డ ఉంటే

వదిలేయండి. అంతేకాని మొత్తానికి మీ బుద్ధిని ఎవడో జేబులో పెడితే మీరు భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను కూడా నష్టపోతారు. వ్యాపారంలో కూడా బహుజాగ్రత్తగా ఉండాలి, మీరు పెట్టుబడి పెట్టేసి నిద్రపోతే ఎవడూ సంపాదించి మీకు ఇవ్వడు. ఇప్పుడు రోజులు మంచివి కాదు. కాలాన్నిబట్టి మీరు నడుచుకోవాలి. ఎవరినో నమ్మేసి మీ డబ్బంతా, మీబుద్ధి అంతా వాడి జేబులో పెట్టేస్తే మీరు సర్వం కోల్పేయే పరిస్థితులు వస్తాయి అని చెప్పాడు.

బాహ్యపరిస్థితులు ఎప్పుడూ ఒకే రకంగా ఉండవు. సంసారం అన్నాక హెచ్చుతగ్గులు ఉంటాయి. అందుచేత బాహ్యపరిస్థితుల మీద ఆధారపడవద్దు. బాహ్యపరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీ నిదానంలో మీరు ఉండండి. పిరికితనం వద్దు. ధైర్యంలేనివాడు ఏపనిలోను సక్సెస్ అవ్వలేడు. ధైర్యంలేనివాడు జ్ఞానం సంపాదించలేడు. మనలాగే బుద్ధుడికి సంసారం ఉందికదా. బుద్ధుడికి ఎంత ధైర్యంఉంటే వాడు గృహపరిత్యాగం చేసాడు. పిరికివాడు అటువంటి పనులు చేయగలడా? ఆయన మహాసామ్రాజ్యానికి అధిపతి. ఆయనకు ఎంత ధైర్యం ఉంటే మహాసామ్రాజ్యాన్ని విడిచిపెట్టి బయటకు వచ్చాడు. ఎంతో కొంత ధైర్యం లేకపోతే నువ్వు సత్కర్మ కూడా చేయలేవు. హృదయదౌర్బల్యం అన్నింటికంటే నీచమైనది కాబట్టి నువ్వు దానిని విడిచిపెట్టు. గతించిపోయిన గొడవల గురించి బెంగపెట్టుకోకుండా వర్తమానకాలాన్ని సక్రమంగా ఉపయోగించుకొంటూ మీ కర్తవ్యకర్మను చేసుకోండి. లోపల ఒకరకంగా బయట ఒకరకంగా కాకుండా చేసేపని హృదయపూర్వకంగా చేయండి. సంసారం పోషించుకోవటానికి ఏవో కొన్ని కామ్యకర్మలు చేసుకోవాలి లేకపోతే శరీరయాత్ర గడవదు. అలాగని 365రోజులు కామ్యకర్మలు వద్దు కొన్ని సత్కర్మలు చెయ్యండి. మీ కుటుంబం కోసం కాకుండా సమాజానికి ఉపయోగపడేపనులు కూడా చెయ్యండి. ప్రతీ చిన్నవిషయానికి భయపడితే మీరు ఏపని చెయ్యలేరు. లోకం గొడవ వదిలేయండి. రోడ్డుమీద విమర్శించే వారిని పట్టించుకోవద్దు. మీ క్షేమం కోరేవారు అయితే మీరు పొరపాటు చేసినప్పడు మీ ఇంటికి వచ్చి ఇది పద్ధతి కాదు, ఇలా అయితే మీరు జీవితంలో నష్టపోతారు మీరు ఇలా నడుచుకోండి అని మంచి సలహా చెబుతారు అంతేగాని రోడ్డుమీద విమర్శించరు. అందుచేత బాహ్యపరిస్థితులకు మీ జీవితాన్ని స్వాధీనం చేయకండి.

ఈ రోజు గాంధీగారి జయంతి, లాల్‌బహదూర్‌శాస్త్రి గారి జయంతి. ఇద్దరూ మహాత్ములే. గాంధీగారు అన్నింటికి దూరంగా ఉన్నారు. శాస్త్రిగారు అలాకాదు అన్ని పదవులు చేసాడు ఏమీ అంటుకోకుండా బయటకు వచ్చాడు. ఒకమాటలోగాని, జీవితంలోగాని ఎక్కడా

ఆడంబరంలేదు. ఇద్దరికి తేడా ఏమిటి అంటే గాంధీగారు అసలు భోగాల జోలికి వెళ్ళలేదు. శాస్త్రిగారు అన్ని భోగాలమధ్యన ఉండి వికారం లేకుండా ఉన్నాడు. తిలక్‌గారిలో ఎక్కడా పిరితనం కనబడదు, ఆయన గొప్పవీరుడు. ఆకాశంవచ్చి నామీద పడిపోతే ఆకాశాన్ని కిందపడేసి నా కాళ్ళకింద తొక్కి నా పని నేను చేస్తాను అన్నాడు, వాడు తిలక్. ఆపని వలన మనం ఏదైనా లాభంపొందుతామా అనే సమస్య అక్కడ లేదు. ఆయన బహుముఖ మేధావి. ఆయన జైలులో ఉండగా భార్య చనిపోతే ఇంటికి వెళ్ళి చూసివస్తాను అని గవర్నమెంట్‌కు పిటీషన్ కూడా పెట్టలేదు. అమ్మ చనిపోయింది అని కొడుకులు ఉత్తరం వ్రాస్తే ఇప్పుడు అమ్మ మీకు ఏపని చేసిపెడుతోందో నేను యింటికి వచ్చాక అమ్మ చేసిన పని నేను మీకు చేసిపెడతాను, మీరు బెంగపెట్టుకోవద్దు అని సమాధానం వ్రాసాడట, వాడు తిలక్. కృష్ణుడు చెప్పిన తత్వం ఆయనలో ఉంది. ఈ క్రింద శ్లోకం అంటే ఆయనకు బాగా ఇష్టం, ఇది ఆయన రక్తంలో జీర్ణం చేసుకొన్నారు, ఇంక రాత్రిపగలు ఇదే ఆయనకు మంత్రం.

**కర్మణ్యే వాధికారస్తే మాఫలేషుకధాచన**

**మా కర్మ ఫలహేతుర్భూః మాతే సంఘోస్త్వ కర్మణ**

నువ్వు పనిచేయటానికే పనికివస్తావు. పని విడిచిపెట్టవద్దు. ఇతరులు గుర్తించినా, గుర్తించకపోయినా నువ్వు చేసే పని భగవంతుడు చూస్తున్నాడు కదా. నీకు మోక్షం ఇచ్చేది భగవంతుడే కదా. ఇతరులు నిన్ను మెచ్చుకొన్నా, నిన్ను విమర్శించినా వారి అహంకారమే కదా. ఇతరుల అహంకారం మీద ఆధారపడి ఎంతకాలం బతుకుతావు. కర్మఫలితం మీద నీకు అధికారం లేదు. దాని మీద అధికారం భగవంతుడిది. ఇతరులు మెచ్చుకోవటం లేదు అని నువ్వు చేసే పని మానకు. నువ్వేదో మంచిపని చేసావని అందరూ సంతోషిస్తారు అనుకోకు. మంచిపనులు చేసినా నిన్ను తిట్టేవారు ఉంటారు. గోడలో అడుగున ఉన్న ఇటుకలు కనబడవు. అలాగే ఈ జన్మకు బేస్‌మెంట్ పూర్వజన్మలు, ఆ పూర్వజన్మలు మనకు కనబడవు. ఆ సంఘటన అలా ఎందుకు జరిగింది, ఈ సంఘటన ఇలా ఎందుకు జరిగింది అని మనం అనుకుంటాము. పూర్వజన్మలకు దీనికి సంబంధం ఉంటుంది. ఈ జన్మలో కారణం కనబడకపోవచ్చు. పూర్వజన్మలలో మనం చేసిన పనులకు ఫలితం భగవంతుడు ఎప్పుడు ఎలా ఇస్తాడో మనం చెప్పలేము. ఫలితం నీ చేతిలో లేదు. ఈ శ్లోకం అర్థమైతే మీకు ఇంక దుఃఖం రాదు. కర్మఫలానికి నువ్వు కారణం కావద్దు. కర్మఫలానికి నువ్వు

కారణం అనుకొంటే నీకూడా దుఃఖం వచ్చేస్తుంది. పనిచేసి మర్చిపో. ఈ పని ఇలా అవుతుంది అనుకోలేదు అనుకుంటే అది నీ చేతిలోలేదు. నీ చేతిలో లేనిదానికి నువ్వు కారణం అనుకొంటే దుఃఖం రాక ఏమి చేస్తుంది. కళ్ళులేనివాడికి కళ్ళు ఇచ్చాడు ఏసు. తరువాత వాడు శుభ్రంగా పాడైపోయాడు. ఏమిటి ఇలా పాడైపోయావు అంటే దానికి మీరే కారణం అన్నాడు. నాకు కళ్ళు లేనప్పడు ఒక ప్రక్కన పడిఉన్నాను. మీరు కళ్ళుఇచ్చాక ఈ లోకంలో ఇన్ని భోగాలు ఉన్నాయి అని తెలిసింది, వాటిని అనుభవించి శుభ్రంగా కుళ్ళిపోయాను. మీరు కళ్ళు ఇవ్వటం వలన ఇదంతా జరిగింది, నేను పాడవ్వటానికి మీరే కారణం అన్నాడు. ఆయన మంచికే ఇచ్చాడు, వాడు పాడైపోతే ఏసు ఏమి చేస్తాడు. వాడి పతనానికి నేనే కారణం అని ఏసు అనుకుంటే ఆయనకీ దుఃఖం వస్తుంది. ఏసు అలా అనుకోలేదు, మన డ్యూటీ మనం చేసాము అనుకున్నాడు. కర్మఫలానికి మీరు కారణం అనుకున్నంతకాలం మీకు వెయ్యికోట్లు ఉన్నా దుఃఖం మిమ్మల్ని వెంటాడుతుంది. కర్మఫలితం భగవంతుడి చేతిలో ఉంది. ఆయన చేతిలో ఉన్న పని గురించి ఆలోంచించకు, దాని గురించి ఆలోచించటం వలన నీకు ప్రయోజనం లేదు, ఆయన జడ్జిమెంట్ నువ్వు అంగీకరించవలసిందే.

శాంతిలేనివాడికి సుఖంలేదు. మనం దారిద్ర్యం అనుభవించగలం గాని మానసికంగా అశాంతి అనుభవించలేము. నువ్వు చేసే మంచి పనులు ఎవరూ గుర్తించటం లేదు, సన్మానాలు చేయటం లేదు అని అసలు పని యందే విరక్తి పెట్టుకోవద్దు. గుర్తింపులు రావటం లేదు అని మీ చేతిలో ఉన్న పని మానేస్తే మీదే దోషం. గుర్తింపులు కోరుకోవటం వలన అహంకారం పెరుగుతుంది. మనల్ని ఎవరూ గుర్తించకపోవటం మంచిది. ఎందుచేతనంటే మనం శాంతిగా ఉండవచ్చు. నీ మనస్సు ఎటు గంతులు వేయమంటే అటు గంతులు వేయకు. నీ మనస్సు కోతి లాంటిది. ఒక రోజు పెట్టమంటుంది, యింకోరోజు కొట్టమంటుంది. అది నిజంకాదు. దేవుడు చెప్పిన వాక్యానికి అనుగుణంగా ప్రవర్తిస్తున్నామా లేదా అనేది చూసుకోవాలి. మనస్సు ఎలా చెపితే అలా ప్రవర్తించకూడదు, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించు, ధర్మాన్ని ఆచరించు అదే నిన్ను రక్షిస్తుంది. స్వార్ధంలేకుండా నువ్వు చిన్న మంచిపని చేసినా అది నిన్ను రక్షిస్తుంది.

**బుద్ధి యుక్తోజహాతీహ ఉభేసుకృతదుష్కృతే**

**తస్మాత్ యోగాయ యుజ్యస్వయోగః కర్మసుకౌశలం (2-50)**

నువ్వు కర్మ ఎలా చెయ్యాలి అంటే సమానబుద్ధితో చెయ్యాలి. అంటే మీరు పనిచేస్తూ ఉండాలి, దాని ఫలితం మీకు అంటకూడదు. యోగం అంటే అది, నేర్పు అంటే అది. మీరు సత్కర్మ చేసి ఏదైనా ఆశిస్తారు అనుకోండి, అది అంటుకొంటుంది, అది నేర్పు కాదు. సమాన బుద్ధి కలవాడు, సహృదయం కలవాడు వాడు చేసిన పాపాన్ని, వాడు చేసిన పుణ్యాన్ని ఇక్కడే వదిలేసి శరీరాన్ని విడిచిపెట్టి వెళ్లిపోతాడు. బుద్ధిలేనివాడు పుణ్యపాపాలను మోసుకొని పోతాడు అక్కడ నుండి స్వర్గమో, నరకమో సిద్ధంగా ఉంటాయి. ఈ రెండు మోసుకొని వెళ్లడు అనుకోండి, ఇంక స్వర్గంలేదు, నరకంలేదు, హాయిగా ఉంటాడు అంటే లగేజీ అంతా ఇక్కడే విడిచిపెట్టేయాలి. అలా విడిచిపెట్టటం అంత తేలిక కాదు, దానికి ట్రైనింగ్ అవసరం అంటే పుణ్యపాపాలను ఇక్కడే ఎలా విడిచిపెట్టాలో నేర్చుకో.

అమృతత్వం పొందమని ఉపనిషత్‌లలో చెపుతారు. అమృతత్వం అంటే మృత్యువు రాకముందే మృత్యువుని జయించటం అంటే మృత్యువు వచ్చినా మీకు దానితో సంబంధం ఉండదు, శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనే బుద్ధి మీకు కలుగదు, అది అమృతత్వం. మన శరీరాన్ని స్మశానంలో అగ్ని కాల్చేస్తుంది. మీలోపల ఉన్న సద్వస్తువును అగ్ని కాల్చలేదు. అది మీ హృదయంలో ఉంది, అంతటా కూడా ఉంది. మీ హృదయంలో ఉండటమే కాదు అది మీరై ఉన్నారు. మీ హృదయంలో ఉన్న వస్తువును గుర్తిస్తే కాని అంతటా ఉన్నది, ఇది ఒక్కటే అనే అనుభవం మీకు రాదు. ఇప్పుడు మీకు శరీరంతో తాదాత్మ్యం ఉంది, మనస్సుతో తాదాత్మ్యం ఉంది, యిది సహజంగా ఉంది. అలాగ లోపలఉన్న సద్వస్తువుతో మీకు తాదాత్మ్యం వస్తే శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అని మీకు అనిపించదు ఎందుచేతనంటే చావులేని సద్వస్తువుతో మీకు తాదాత్మ్యం ఉంది కాబట్టి. ఆ స్థితిని ఇప్పుడే మీరు పొందండి. అంత తొందరగా మేము పొందలేము అని అంటే కనీసం చనిపోయేరోజుకైనా పొందండి, అప్పుడు ఇంక మీకు పునర్జన్మ లేదు అంటే ఇంక మీరు శవాలను మోయనక్కరలేదు. ఆ స్థితిని పొందకుండా మీరు కనుక చనిపోతే మీరు పొందే నష్టం ఇంత అని లెక్కలు కట్టి చెప్పలేము, అపారమైన నష్టాన్ని పొందుతారు. అమృతత్వం పొందాలి అంటే ఇంద్రియాలు, మనస్సు అదుపులో ఉండాలి. మనస్సు, ఇంద్రియాలు ఎవడికైతే అదుపులో ఉండవో వాడి బుద్ధి స్థిరంగా ఉండదు, మాటలో స్థిరత్వం ఉండదు. నోటికి ఎలా వస్తే అలా మాట్లాడతాడు, వాడు అయుక్తుడు. వాడు రోజుకోరకంగా ప్రవర్తిస్తూ ఉంటాడు.

మనం చాలామందిని చూస్తూ ఉంటాము, వారికి పరిస్థితులు అనుకూలంగా లేకపోతే భక్తిని వదిలేస్తారు. మేము చాలాకాలం నుండి భక్తిగా ఉన్నాము, దేవుడు మాకు ఏమి ఉపకారం చేసాడు అంటారు. ఎవడి అంతఃకరణం అయితే దోషపూరితంగా ఉందో వాడికి కనీసం భగవంతుడి మీద విశ్వాసం కూడా కలుగదు. భగవంతుడు అనేవాడు ఉన్నాడు అనేటువంటి భావన స్థిరంగా లేనివాడికి శాంతి కలుగదు, శాంతి లేనివాడికి సుఖంలేదు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. మీకు నాకు ఈ పంచభూతాలకు కంట్రోలర్ ఒకడు ఉన్నాడు అని స్థిరమైన బుద్ధి కలిగినవాడికి, వాడి సాధనతో నిమిత్తం లేకుండా దుఃఖం అంతా నశిస్తుంది. మీకు కష్టం వస్తే దేవుడు లేడు అనుకోవటం. మీ కష్టాలకు, సుఖాలకు దేవుడికి సంబంధం ఏమిటి? మీరు చేసిందే మీకు ఎదురు వస్తుందని మీకు తెలియటం లేదు. మీరు మంచి చేస్తే మంచి, చెడ్డ చేస్తే చెడ్డ ఎదురువస్తుంది. దీనికి దేవుడికి ఏమీ సంబంధం లేదు.

అంతఃకరణంలో దోషం లేనప్పుడు భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడని సజీవమైన విశ్వాసం కలుగుతుంది. అప్పుడు మీ మనస్సు పరమాత్మను అంటుకొనిపోతుంది. మీరు పెద్ద పెద్ద సాధనలు చేయలేకపోయినప్పటికి, యోగాభ్యాసాలు లేకపోయినప్పటికీ భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే నిర్ణయం స్థిరంగా ఉంటే మీకు దుఃఖం పోతుంది. ఎందుచేత నంటే అప్పుడు ఏది వచ్చినా ఆయన ప్రసాదమే అనుకొంటారు. ప్రతీ మనిషికి విషయ-చింతన ఉంటుంది. పూర్వజన్మ సంస్కారములనుబట్టి ఒకోమనిషిని ఒకో విషయం ఆకర్షిస్తుంది. ఏ విషయం మీదకు మన మనస్సు ఎక్కువ వెళుతుందో ఆ పని పూర్వజన్మలలో మనం ఎక్కువగా చేసినట్లు. ఈశ్వరుడి మీద విశ్వాసం పెరుగుతూ ఉంటే మనస్సు ఆ విషయాలతో ఉన్న సంబంధం తెంపుకుని దేవునిపాదాలను అంటిపెట్టుకోవటానికి తిరిగివచ్చేస్తుంది, అదీ మీకు లాభం. మీరు తక్కువ ప్రయత్నం చేసినా భగవంతుని పట్ల విశ్వాసం ఉంటే మనస్సు తొందరగా వెనక్కి వచ్చేస్తుంది. ఈ రోజు ఒక అమ్మాయి నా దగ్గరకు వచ్చింది. నీకు అమెరికాలో సుఖంగా ఉందా, ఇండియాలో సుఖంగా ఉందా అని ఆ అమ్మాయిని అడిగాను. అమెరికాలోను సుఖంలేదు, ఇండియాలోను సుఖం లేదు, మనస్సులోపలకు వెళ్ళినప్పుడు సుఖంగా ఉంది అని చెప్పింది. నాకు ఆశ్చర్యం వేసింది, ఆ అమ్మాయి గురువు అనిపించింది. మనస్సు హృదయాభిముఖంగా వెళితే అక్కడ సుఖం తెలుస్తుంది అని చెప్పింది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| నవంబర్ | 13 | తణుకు, క్షత్రియ కల్యాణ మండపం |
| నవంబర్ | 20 | మురమళ్ళ, శివాలయం |
| నవంబర్ | 25 | గొరగనమూడి, జ్ఞానానంద ఆశ్రమం |
| నవంబర్ | 30 | జిన్నూరు రమణ క్షేత్రం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

# రమణ పరంపర

పుణ్యం పండిన ప్రతి వ్యక్తినీ ఆకర్షించారు భగవాన్. అనేకమంది వారి సన్నిధానంలోనే ఉండిపోయారు.

కొంతమంది భగవాన్ మీదా, వారి అహం మూలాన్వేషణ పద్ధతి మీదా పుస్తకాలు వ్రాసారు.

అలా వ్రాసిన తెలుగువారిలో పూజ్యులు కావ్యకంఠ గణపతి మునీంద్రులూ, మునగాల వెంకట్రామయ్యగారు, కృష్ణభిక్షుగారు, సూరినాగమ్మగారు, చలంగారు, గిద్దలూరి లక్ష్మీనరసింహంగారు, జి.వి. సుబ్బరామయ్యగారు, నిమిషకవి పేర్రాజుగారు ముఖ్యులు.

ఇక, భగవాన్ దర్శనానికి నోచుకోకపోయినా, ఏ పూర్వజన్మల పుణ్యఫలం వల్లనో భగవాన్ భక్తులై ఆంధ్రదేశమంతటా రమణగోష్టులు జరుపుతున్న మహానుభావులు మనకు తెలిసి ఉన్నంతవరకు ముగ్గురు ఉన్నారు.

ఒకరు కృష్ణాజిల్లా వాస్తవ్యులు "రమణవాణి" సంపాదకులూ అయిన జి.వి. నాగేశ్వరరావుగారు. వీరి ప్రసంగం ఒక జీవనదిలా, తాపీగా ప్రవహిస్తూన్నట్లు వుండి వీనులకు విందు చేస్తుంది. ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది.

రెండవవారు పశ్చిమగోదావరి జిల్లా జిన్నూరు వాస్తవ్యులైన భూపతిరాజు వెంకట లక్ష్మీనరసింహరాజుగారు (జిన్నూరు నాన్నగారు). వీరు జన్మతః మహావక్త. గొప్ప తత్వవేత్త. వీరి ప్రసంగం మంద్రస్థాయిలో ప్రారంభమై, మధ్యమస్థాయికి చేరుకుని, ఉరుములు మెరుపులతో, సింహగర్జనలతో ఎప్పుడో ఎక్కడో తారాస్థాయిలో ముగుస్తుంది. ప్రసంగ మధ్యంలో వీరిని ఏ దేవతో ఆవేశించినట్టు తోస్తుంది. వీరు శ్రోతల హృదయాల మీద చెరగని ముద్రలు వేస్తారు.

వీరిద్దరూ ఏకధాటిన నాలుగైదు గంటలు ప్రసంగించినా వినేవారికి విసుగు పుట్టదు సరికదా, మరికొంతసేపు చెబితే బాగుండును అని కూడా అనిపిస్తుంది.

మూడవవారు అనంతపురం జిల్లా తాడిపత్రి వాస్తవ్యులూ "భగవాన్ శ్రీ రమణ మహర్షి ఆశ్రమం" వ్యవస్థాపకులూ, అధ్యక్షులూ అయిన వి.వి. బ్రహ్మంగారు. వీరు కూడా చక్కగా ప్రసంగిస్తారు. వీరు భగవాన్‌కు అంకితమైన అదృష్టవంతులు.

(మూలం : ఆత్మదర్శిని ఆధ్యాత్మిక మాసపత్రిక, అక్టోబర్ 2011 సంచిక నుండి సంగ్రహించబడింది)

# నిరంతరం శరీర ధ్యాసే అయితే - చావులేని ఆత్మ అనుభవానికి రాదు

స్వశరీరాన్ని ప్రేమించటం ప్రాణికి సహజధర్మం. ఈ సహజత్వంలోంచే అహంకారం పుంజుకొంటుంది. శరీరానికి అనేక రకాల సుఖాలను అందించాలని తాపత్రయపడుతుంది. శరీరం తాను కాదని తెలుసుకొని సత్యానుభవం పొందాలన్న వారికి కూడా శరీరంపై ప్రేమ కలిగి ఉంటుంది. విషయసుఖాలమీద విముఖత సాధించవచ్చు ఏది సత్యం - ఏది అసత్యం అనే ఎరుక ఉండవచ్చు కాని ధ్యానంలోకి వెళ్లలేరు రేఖామాత్రంగా శరీరం నేను అనే ధ్యాస కారణం. యవ్వనానికి ముసలితనం ధర్మం. శరీరానికి వ్యాధి ధర్మం. జీవితానికి మృత్యువు ధర్మం. చివరి రోజుల్లో జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు పనిచెయ్యవు ఇది కూడా శరీర ధర్మం. మనస్సులో పుట్టే ఆశలు కోర్కెలు పరమేశ్వరుడు తీర్చాలని ఆశపడతాము. దురాశతో కోరికలను పెంచుకోకూడదని మన మనస్సుకు నచ్చచెప్పము. ఈశ్వరాభిష్టం ప్రకారం నడుచుకోమని మనం మన మనస్సుకు నచ్చచెప్పము ప్రకృతి రూపాలమీద ఆశక్తి నిజమనుకోవటం వల్ల అలా జరుగుతున్నది. నీవు కాని దాని గొడవలను ఆలోచిస్తే ఎన్ని తలంపులు, ఎన్ని గొడవలు అలాగే ఉంటే మనం అయ్యేది ఆత్మకాదు శరీరంగానే మిగులుతాము. ఈ క్షుద్రమైన దేహదృష్టి నుంచి మనం ఏ క్షణంలో అతీతమై ఆత్మదృష్టిలో నిలుస్తామో అప్పడే భయ విముక్తులమౌతాము. మనం విషయసుఖాలను అనుభవిస్తూ అదే సమయంలో సత్యాన్ని గ్రహించలేము. ఇంద్రియాల మూలంగా లభించే ఆనందం క్షణికం అని తెలుసుకొంటాము. అగ్నిని నెయ్యితో ఆర్పితే వృద్ధి అవుతుంది. విషయ సుఖాలు అనుభవించే కొలది ఇంకా హెచ్చుతాయి. కొత్తకోరికలు చిగురిస్తాయి. కోరికలను నిరోధిస్తే క్రోధం కలుగుతుంది. గోడకేసి కొట్టిన బంతి తిరిగి మనలనే కొడుతుంది. కోపంతోనూ కోరికతోనూ చిక్కుకున్న వానికి విచక్షణాశక్తి అంతరిస్తుంది. గాంధీజీ "ఆధ్యాత్మికత్వం లేని లౌకిక జీవనం ప్రాణంలేని దేహంతో సమానం" అన్నారు. మహాత్ములు అంటారు "ప్రాణం ఉండగానే శవంలా జీవించటం నేర్చుకొంటే అప్పడే నీకు ప్రభుదర్శనమౌతుంది. యమదూతలు వచ్చిన తరువాత అందరిలా మరణించటం వల్ల ప్రయోజనం లేదు" అని. శరీర బాధను ఇష్టంతో అనుభవిస్తే ఆధ్యాత్మిక స్వస్థతను స్వీకరించటానికి అర్హత లభిస్తుంది. వాటిని భగవంతుడు ఇచ్చిన వరాలుగా భావిస్తూ హుందాగా స్వీకరించినట్లైతే అది తరగని ఆనందానికి దారితీస్తుంది. మనస్సు గుడ్డిది అయితే శరీరాలు అందంగా కనిపిస్తాయి. విషయ వాసనల గుడ్డితనాన్ని గురువు ఆపరేషన్ చేసి స్వచ్ఛతను ప్రసాదిస్తారు.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం